# కులట

"నీ భార్యా మహా పతివ్రత అనుకుంటున్నావు గామాలు. నీ మొహం ఎరక్క మునుపు అది నా దగ్గిరికి ముప్ఫై మూడుసార్లు వచ్చింది, కాదనమను."

సంతకం లేదు.

అతను సావధానంగా ఉత్తరం చించేసి దీర్ఘాలోచనలో పడ్డాడు.

ఇది ఎవడికీ జరగరాని అనుభవం. మామూలు మనిషి దీనికి తట్టుకోలేడు. పిచ్చివాడైపోతాడు. తను పిచ్చివాడై పోరాదు.

ఆ ఉత్తరంలో ఉన్న విషయం నిజమే అయి ఉండవచ్చు. నిజమని నమ్మే కర్తవ్యం ఆలోచించాలి.

అది రాసినవాడు తనమీది ప్రేమచేత రాయలేదు. తన భార్య మీదా తన మీదా కూడా పగతీర్చుకొనేటందుకు రాశాడు. అంతవరకూ తనూ తన భార్యా ఒకేపక్షం.

తను తన భార్యను చాలా గాఢంగా ప్రేమించాడు.

తను ఎరిగినంతలో ఏ భర్తా భార్యకివ్వనంత స్వేచ్ఛ ఇచ్చాడు.

అది దుర్వినియోగపరచి ఆమె తన్నెప్పుడూ చులకనగా చూడలేదు.

ఆమె తనను ప్రేమించింది. ప్రేమించని మనిషి తనకేసి అట్లా చూడలేదు. సంవత్సరం నించీ కాపరం చేస్తున్నా తమ ప్రణయం మెరుపు మాయలేదు. తన మీద ప్రేమ లేకపోతే తను కనిపించగానే పువ్వు వికిసించినట్టు ఎట్లా వికసిస్తుంది? తనను చూసుకుని అంత ఎందుకు గర్విస్తుంది?

తనూ అదివరకు – పెళ్లికాక పూర్వం – తనకన్న నాలుగేళ్లు పెద్దదైన ఆడదాన్ని ఎరుగుదును. తను ప్రణయానుభవం పొంది ఉండటం లాభించింది.

తన భార్యక్కూడా అంతేనేమో!

ఈ విషయం తను భార్యతో చర్చించాలా, వద్దా?

తను ఏ చర్యా తీసుకోకపోతే ఆ ఉత్తరం రాసినవాడూరుకుంటాడా?

కులట అని దేశమంతా చాటుతాడు! కులటను పెట్టుకుని కాపరం చేస్తున్న అపఖ్యాతి భరించటం తనకు అసంభవం.

ఇటువంటి భార్య మరొకతె తనకు దొరకదు.

ఆ ఉత్తరం రాసినవాడి ఓర్చలేనితనానికి తను అనుభవించే శిక్ష - తను ఈ భార్యను పోగొట్టుకోవటం.

అతనింటికి రాగానే తల దువ్వుకుంటున్న భార్య చేతుల్లో జడ విడిచేసి అతని కెదురొచ్చి గట్టిగా వాటేసుకుని మొహం పైకెత్తింది.

కొంచెం అనుమానించి అతనామెను ముద్దు పెట్టుకున్నాడు. ముద్దు రుచించలేదు. ఇక ఎప్పటికీ ఇంతేనేమో!

"అట్లా ఉన్నారేమండీ!" అన్నది అతని చొక్కా పట్టుకుని పసిపిల్లల్లే లోపలికి నడుస్తూ.

గదిలో పందిరి పట్టెమంచం చూడగానే అతను నిలువునా నీరైపోయినాడు.

తనకేసి వింతగా చూస్తున్న భార్యను గాఢంగా - ధృతరాష్ట్రుడు ఇనప భీముణ్ని వాటేసుకున్నట్టు - వాటేసుకున్నాడు. ఆమెను పసిపిల్లను ఎత్తినట్టు రెండు చేతుల్లోనూ ఎత్తి మంచంమీద పడేసి తన మొహం ఆమె వక్షానికి గట్టిగా అదుముకున్నాడు.

ఆ ఉద్రేకపు ఉప్పెన తీరిపోగానే అతను మరో మనిషి అయినట్టయింది.

"రాత్రి బండికి మీ వాళ్లింటికి పంపేస్తున్నాను! త్వరగా వంట చెయ్యి" అన్నాడతను.

ఆమె తనకేసి చూస్తున్నదని అతనెరుగును. కాని ఆమెకేసి చూడలేక పోయినాడు.

ఆమె తనని ఎందుకనిగాని ఏమిటనిగాని అడగలేదు.

ఏమైనా సంశయం ఉంటే రూఢి అయిపోయింది.

"బండికి వేళౌతున్నది?" అన్నాడతను మరికొంతసేపటికి?

"ఇవాళ వద్దు. రేపు వెళతాను. తప్పక వెళతాను" అన్నదామె దీనంగా.

"నీ యిష్టం! మరో వాయిదా మాత్రం వెయ్యకు!"

తను భోంచేసి పడుకున్నాడు. ఆమె భోంచేసి వచ్చింది. కళ్లు మూసుకుని నిద్రపోతున్నట్టు నటించాడు. ఆమె వచ్చి తేలికగా తన పక్కమీద కూర్చున్నది.

గంట గడిచింది. ఆమె ఇంకా కూర్చునే ఉంది. ఏం చేస్తున్నది? తనకేసి చూస్తున్నదా? ఏం చూస్తుంది? తను మేలుకున్నట్టు తెలిసి ఇదో ఎత్తు వేస్తున్నదా? కళ్లు తెరిచాడు.

ఆమె చప్పున మంచం మీది నుంచి లేచింది.

"ఏమిటి?" అన్నాడు.

ఆమె మళ్లీ అతని పక్కనే కూర్చునే, "నన్నొకసారి కావిలించుకోండి. ఇందాకటల్లే" అన్నది.

అతని చేతుల్లో బలమే ఉన్నట్టులేదు.

అతనికి మూడింతలు బలంతో ఆమే అతన్ని కావలించుకున్నది.

"ఒక్క ముద్దు పెట్టండి!"

ఆమె నోరు సన్నిపాతరోగి శరీరమల్లే కాలిపోతున్నది.

ఆమె భర్తను విడిచి ఎడంగా పోతూ, "లాభం లేదు, బతికున్నన్నాళ్లూ చెయ్యాలిసిన పని ఒక్క క్షణంలో చెయ్యటం అసంభవం" అన్నది.

అతని కర్థం కాలేదు!

ఇదంతా తనని మస్కావెయ్యటం! అమ్మో, ఆడదాని ఎత్తు!

పన్నెండు గంటలవేళ అతనికి కలతనిద్ర పట్టింది. ఆమె మళ్లీ అతనికేసి చూడలేదు.

అతనికి తిరిగి మెళుకువ వచ్చేటప్పటికి ఎక్కడో కోడి కూస్తున్నది.

ఆమె పక్కమీద లేదు.

ఆమె కోసం గంటసేపు చూశాడు. రాలేదు.

అతనికి మళ్లా నిద్రపట్టింది.

మర్నాడుదయం బావిలో ఆమె శవం కనిపించింది.

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***

***యువ కార్యాలయం, తెనాలి***